ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 16-11-2026 సమయం: రాత్రి 8గం.30ని.లు

ముఖ్యాంశాలు

❖ సమాజంలో మార్పు తేవడమే నిజమైన విజయమని ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

❖ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పార్వతీపురం మన్యం జిల్లా సంయుక్త కలెక్టర్ ఆర్. వైశాలి తెలిపారు.

❖ భారత ప్రభుత్వ కేంద్ర ప్రజా పనుల శాఖ (CPWD), భాభా అణు పరిశోధనా కేంద్రం (BARC) విశాఖపట్నం మధ్య ఒక అవగాహన ఒప్పందం (MoU) కుదిరింది.

❖ ఆగ్నేయ, నైరుతి బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం కొనసాగుతోందని భారత వాతావణ కేంద్రం వెల్లడించింది.

==========

విజయవాడలోని బి.ఆర్. అంబేడ్కర్ కళావేదికలో రామోజీ ఎక్స్‌లెన్స్ అవార్డుల ప్రదానోత్సవం జరుగుతోంది. రామోజీరావు జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి కేంద్ర హోం మంత్రి అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ గౌరవ అతిథిగా పాల్గొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్‌తో పాటు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ... సమాజంలో మార్పు తేవడమే నిజమైన విజయమని అన్నారు. సాధారణ వ్యక్తిగా పుట్టి అసాధారణంగా ఎదిగి సమాజానికి సేవ చేసిన వ్యక్తి రామోజీరావు అని కొనియాడారు. సామాజిక చైతన్యం కలిగించే అనేక కార్యక్రమాలను తనకు వివరించారని తెలిపారు. ఒక వ్యక్తి విజయం ఆ వ్యక్తితోనే ఆగిపోకూడదని, అది అనేక మందికి స్ఫూర్తిగా నిలవాలని పవన్ కళ్యాణ్ అన్నారు. భావి తరాల్లోనూ స్ఫూర్తి కలిగించిన వ్యక్తి రామోజీరావు అని ఉపముఖ్యమంత్రి ప్రశంసించారు.

(వాయిస్ 30 సెకన్లు)

==========

ఖరీఫ్ 2026-27 సీజన్‌కు సంబంధించి పార్వతీపురం మన్యం జిల్లాలో ధాన్యం కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా సంయుక్త కలెక్టర్ ఆర్. వైశాలి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా 181 రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ చేపట్టనున్నట్లు వెల్లడించారు. రైతులకు అవసరమైన గోనె సంచులను ప్రభుత్వమే రైతు సేవా కేంద్రాల ద్వారా అందిస్తుందని తెలిపారు. గోనె సంచుల కోసం రైతులు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో అధికారులను సంప్రదించాలని సూచించారు. ధాన్యం రవాణా కోసం కొనుగోలు కేంద్రాల సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. రైతులే రవాణా ఏర్పాట్లు చేసుకుంటే ప్రభుత్వ నిబంధనల ప్రకారం రవాణా చార్జీలు చెల్లిస్తామని తెలిపారు. ధాన్యం విక్రయించే రైతులు నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సంయుక్త కలెక్టర్ సూచించారు. ధాన్యంలో తేమ శాతం ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున.. 6 నుంచి 10 రోజుల పాటు బాగా ఎండబెట్టి తేమ శాతం 17 లోపు ఉండేలా చూసుకోవాలని సూచించారు. రైతులకు మరింత సౌకర్యం కల్పించేందుకు వారి కల్లాల వద్ద లేదా ధాన్యం నిల్వ చేసిన ప్రదేశంలోనే కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టినట్లు సంయుక్త కలెక్టర్ ఆర్. వైశాలి వివరించారు.

==========

భారత ప్రభుత్వ కేంద్ర ప్రజా పనుల శాఖ (CPWD), భాభా అణు పరిశోధనా కేంద్రం (BARC) విశాఖపట్నం మధ్య ఒక అవగాహన ఒప్పందం (MoU)కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం.. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలో ఉన్న BARC ప్రాంగణంలో సుమారు 800 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ప్రధాన నివాస కాలనీకి మాస్టర్ ప్లాన్ తయారీతో పాటు వివిధ దశల్లో నివాస గృహాలు, కార్యాలయ భవనాల నిర్మాణం చేపట్టనున్నారు. మొదటి దశలో భాగంగా 70 నివాస గృహాల నిర్మాణం చేపట్టనున్నారు. ఈ మొదటి దశ నిర్మాణ పనుల అంచనా వ్యయం సుమారు 80 కోట్ల రూపాయలు. తదుపరి దశల్లో మరిన్ని నివాస గృహాలు, కార్యాలయ భవనాల నిర్మాణం చేపట్టేందుకు కూడా ఈ అవగాహన ఒప్పందం కుదిరింది.

==========

దేశంలో ప్రభుత్వ ఆరోగ్య వ్యయం గత పదేళ్లలో మూడు రెట్లకు పైగా పెరిగిందని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. 2013-14లో లక్షా 30 వేల కోట్ల రూపాయలుగా ఉన్న ఈ వ్యయం.. 2023-24 నాటికి 4 లక్షల 14 వేల కోట్ల రూపాయలకు చేరిందని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ విడుదల చేసిన జాతీయ ఆరోగ్య ఖాతాల నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించింది. ఈ నివేదిక ప్రకారం.. ఒక వ్యక్తిపై ప్రభుత్వం చేస్తున్న ఆరోగ్య వ్యయం కూడా పెరిగింది. 2013-14లో ఏడాదికి వెయ్యి 42 రూపాయలుగా ఉండగా, 2023-24 నాటికి 2 వేల 959 రూపాయలకు చేరిందని తెలిపింది. మరోవైపు, ప్రజల వైద్య ఖర్చుల మొత్తం గతంలో 64.2 శాతంగా ఉన్న ఈ వాటా, ప్రస్తుతం 42.7 శాతానికి తగ్గిందని పేర్కొంది. ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు, ఉచిత వైద్య పరీక్షలు, జన ఔషధి కేంద్రాల వంటి కార్యక్రమాలు ఇందుకు దోహదపడ్డాయని నివేదిక తెలిపింది.

విరామం

==========

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం తుఫానుగా బలపడి, తదుపరి తీవ్ర లేదా అతి తీవ్ర తుఫానుగా మారే అవకాశం ఉందని, ఈనెల 20 నాటికి నెల్లూరు–తుని మధ్య ఆంధ్రప్రదేశ్ తీరాన్ని దాటే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (IMD) హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో పోలవరం జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కె. దినేష్ కుమార్ ఈరోజు ఒక ప్రకటనలో సూచించారు. తుఫాను ప్రభావంతో నవంబర్ 17 నుంచి 20వ తేదీ వరకు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు. ముఖ్యంగా రంపచోడవరం, మారేడుమిల్లి, వై.రామవరం, గుర్తేడు, అడ్డతీగల, గంగవరం, రాజవొమ్మంగి, దేవీపట్నం మండలాలతో పాటు చింతూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. భారీ వర్షాలు, ఈదురుగాలుల సమయంలో అత్యవసరమైతే తప్ప ప్రజలు ప్రయాణాలు చేయరాదని, పొంగిపొర్లే వాగులు, వంకలు, లోతట్టు వంతెనలు, కాజ్‌వేలపై నుంచి రాకపోకలు సాగించేందుకు ప్రయత్నించరాదని కలెక్టర్ సూచించారు.

==========

భారత ప్రభుత్వ యువజన సర్వీసులు, క్రీడా మంత్రిత్వ శాఖ పరిధిలోని మేరా యువ భారత్ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని ఒక ప్రయివేట్ ఇంజనీరింగ్ కళాశాలలో భారత్ యువ పార్లమెంట్ కార్యక్రమాన్ని ఈరోజు నిర్వహించారు. యువతలో నాయకత్వ లక్షణాలు, ప్రజాస్వామ్య విలువలు, దేశ భవిష్యత్ రూపకల్పనలో భాగస్వామ్యాన్ని పెంపొందించే ఈ కార్యక్రమంలో యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా యోజన అధికారి టి. గోపి మాట్లాడుతూ.. `వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్` పేరుతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి యువత నుండి పెద్ద ఎత్తున స్పందన వస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విజేతగా నిలిచిన మొదటి ముగ్గురిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందని, రాష్ట్రస్థాయిలో ఎంపికైన మొదటి ముగ్గురిని జాతీయస్థాయికి ఎంపిక చేస్తారని తెలిపారు.

==========

ఆరోగ్య భారత్ ఆవిష్కరణలో భాగంగా నడక ఉద్యమాన్ని బలోపేతం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ ఆవిర్భవించి 40 ఏళ్లు పూర్తయిన సందర్భంగా `స్టార్ వాకర్స్ క్లబ్` ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. తొలుత ఆర్ట్స్ కళాశాల వద్ద 5కే వాక్ థాన్‌ను కలెక్టర్ ఈరోజు జెండా ఊపి ప్రారంభించారు. డే అండ్ నైట్ కూడలి మీదుగా నగరంలోని ప్రధాన రహదారుల్లో వాకర్స్ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు.

==========

ఆగ్నేయ, నైరుతి బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం కొనసాగుతోంది. గడిచిన 6 గంటల్లో 6 కిలోమీటర్ల వేగంతో తీవ్రవాయుగుండం కదులుతోంది. ప్రస్తుతం చెన్నైకి 700 కిలోమీటర్లు, విశాఖకు 800 కిలోమీటర్లు, ఒడిశాలోని గోపాల్‌పూర్‌కు 910 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమైంది. దక్షిణ, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో సాయంత్రానికి తుఫానుగా బలపడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. రేపు పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర తుఫానుగా మారనుంది. 20 మధ్యాహ్నానికి అతి తీవ్ర తుఫానుగా మారే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. నెల్లూరు-తుని మధ్య అతి తీవ్ర తుఫానుగా తీరం దాటే అవకాశం ఉందని, జాలర్లు సముద్రంలో వేటకు వెళ్లరాదని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరిక జారీ చేసింది. కోస్తాంధ్రలో ఈనెల 19, 20వ తేదీల్లో ఈదురుగాలులతో భారీ నుంచి అతిభారీ వర్షాలు, కొన్నిచోట్ల అత్యంత భారీ వర్షాలు కురిసే సూచనలున్నాయి. తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలు, రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.

==========
==========